బంధితులు

వై. ఎస్. మురళీధర్

"ఛీ! వదలండీ జడ"

"వదలమంటుంటే . అత్తయ్య పిలుస్తారు. వెళ్ళాలి. ప్లీజ్. ."

గదిలోంచి జయ మాటలు వినిపిస్తున్నాయి. ఆశ్చర్యం వేసి కర్టెన్ తొలగించి చూశాను.

జయ మంచం మీద పడుకుని ఆసక్తిగా చదువుతోంది నవల.

కర్టెన్ చప్పుడుకు చటుక్కున తలెత్తి నన్నుచూచి దిగ్గున లేచి నిల్చుంది.

"నువ్వే నా అమ్మా! అబ్బాయి వచ్చాడేమోనని ..." అన్నాను.

ఆమె నావంక చురచురా చూపి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మంచంమీద పడున్న ఆనవలవైపు ఆమె వెళ్ళినవైపు నిస్సహాయంగా చూసి వరండాలోకి వచ్చి నించున్నాను

ఉదయం పట్టిన ముసురు చీకటి పడినా తగ్గలేదు. జల్లులు జల్లులుగా పడుతోంది వర్షం దూరంగా వెలుగు తన్నుఆ ఒక వీధిదీపం కూడా వర్షంలో గుడ్డిగుడ్డిగా కనబడుతోంది.

అబ్బాయి వస్తాడని అలా నిలబడి ఉన్నానేకాని వాడు అప్పుడే వస్తాడా? టౌనునుంచి రెండు మైళ్లు సైకిలు తొక్కాలి!

"భోజనం వడ్డించాను" లోపలి నుంచి జయ కేక పెట్టింది.

"వస్తున్నా. "

అంతా పొడిపొడి సంభాషణలే.

"నువ్వెళ్ళమ్మా! నే వడ్డించుకుంటాలే"

అక్కణ్ణించి వెళ్ళిపోయిందావిడ.

oo oo oo

"అన్నం పెట్టు!" అరిచాడు రామం



కాకీ చొక్కా గుండీలు విప్పుతూనే.

"పెట్టే ఉంచాను!" తిరిగి అంతటి స్వరంతోను జవాబిచ్చింది జయ.

రెండు క్షణాలు నిశ్శబ్దం. తరువాత పీట వాలిన చప్పుడు.

"కూర ఇలా తగలడ్డాదేవిటి?"

"....... ...."

"అన్నం చచ్చిపోయినట్టుంది."

"...................."

"ఏమిటి మాట్లాడవ్?"

"ఏం మాట్లాడను?"

"మనుషులు తినటానికా, పశువుల కని వండేవా?"

"పశువుల " ఆగిపోయి, "మనుషులే తింటున్నారుకదా!" అంటూ గొణిగింది.

"అక్కడే సణుగుతూ కూర్చోక పోతే ఇక్కడ చావరాదా!"

"చావవలసినఅవసరం నాకులేదు."

"మాటకు మాట చెబుతున్నావ్. తలవిండా పొగరెక్కింది."

"హుఁ."

"నెయ్యేదీ? ఇక్కడి కనిపించటం లేదే."

"నెయ్యి అయిపోయింది."

"ఇలావస్తావా! అక్కడే చస్తావా?"

తడబడుతున్న అడుగుల చప్పుడు. తరువాత సరుకుల బీరువా తలుపుతీసిన కిర్రుమనే శబ్దం ఆ తరువాతి నిముషంలోనే దభీమని ఏదో పడిపోయిన శబ్దం వినిపించింది.

గబగబా అక్కడికి వెళ్ళాను.

జయ చేతిలోంచి పచ్చడి జాడీ జారిపోయింది.

రామం పెర్రేగిపోతున్నాడు.

oo oo oo

"ఇదేమిటీ! ఈ నవలెక్కడిది?"

"... . ... "

"నవల్లు చదవమని ఎవడు చెప్పాడు?"

"ఎవడు చెప్పాలి?"

"ఆః .." కోపం నిగ్రహించుకున్నాడు. "నవలలు చదవొద్దని ఎన్ని సార్లు చెప్పాలి "

"... ... . "

"నువ్వు నవలలు చదవడం నా కిష్టం లేదు."

"నాకిష్టమే"

"నీ ఇష్టాయిష్టాలు ఎవడిక్కావాలి? బోడి ఇష్టాయిష్టాలు!"

"బోడికి."

ఏమిటే! నన్ను బోడి అంటావా? నిన్నూ. "

రామం విసురుగా వెళ్ళి జయఎడమ చెయ్యి వెనక్కి మెలితిప్పి, జడతో ఒక చుట్టు చుట్టాడు. తరువాత కుడి చెయ్యి కూడా మెలితిప్పి మిగిలిన జడతో వెనక్కి విరిచి కట్టాడు. ఇంత జరిగినా జయ "అమ్మా ." అని వినబడీ వినపడనట్లుగా గొణిగింది.

జయను గది మధ్యకంటూ పడిపించుకు వచ్చాడు. ఆమెకు ఎదురుగా నిలబడి, "చూడు! ఇప్పుడు నిన్నేం చేస్తానో" అంటూ బలంగా వెనక్కి ఒక్క తోపు తోశాడు ఈ దూరాత్మరి జామా కి తట్టుకోలేక "అమ్మోయ్" అంటూ వెర్రికేక వేసి, ఒక మూలకు పడిపోయింది. ముందుకు లేవాలని ప్రయత్నించి మళ్ళీ పడిపోయింది. కాలు మెలితిరిగి ఉంటుంది.

"ఇప్పటికన్నా అణిగిందాపొగరు!" అంటూ తిరిగి టేబుల్ మీదున్న నవలను కసిగా చేతిలో తీసుకున్నాడు నవలను నగానికి విడిగా పట్టుకుని, ఇదిగో ఇకనుంచి ఈ ఇంట్లో నవలలు కనబడ్డాయా- ఇంతే సంగతులు!" అంటూ సర్రున చింపబోయాడు.

"ఆగండి! చింపకండి."

ఆమెలో వచ్చిన ఈ మార్పుకి సంతోషించాడు.

"ఏం? ఎందుకు చింపకూడదు!"

"ఆ నవల మనదికాదు"

"ఎవరిది?"

"ఉషాబాలది."

"ఉషాబాల" ఆ మాటవింటూనే ముఖం తేపురించింది. "అది ఇక్కడి కెందుకు వచ్చింది!"

"మధ్యాహ్నం .. కాలక్షేపానికి వచ్చింది"

"అలాగా మధ్యాహ్నం వచ్చి నవల్లు సరఫరా చేసి వెళుతోందా?"

" . . "

"అసలు నీకది ఎలా తెలుసు!"

"చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం"

"ఓహో! ఒకే బళ్లో చదివారన్న మాట"

"హుఁ" అంటూ నిట్టూర్చింది

"మా పోలీస్ స్టేషన్‌కు వారాని కొకసారి దాన్ని పట్టుకొస్తారు."

"నాకు తెలియదు" మతి పోయినట్టు చూస్తూ అంది.

"నీకు తెలుసనుకుంటున్నాను." అన్నాడు ఎగతాళిగా.

"ఏమిటి మీరనేది?"

"ఒకే బళ్లో చదివినవాళ్ళకి ఆ మాత్రం తెలీదా అని"

సన్నగా మూలుగుతూ ఏడుస్తున్న శబ్దం. కొంచం సేపటికి ఏడుపు ఆగిపోయింది. వెక్కిళ్లు వినబడుతున్నాయి.

అవతలి వ్యక్తి నరం దొరికింది రామానికి. ఇక తను ఆడించినట్టు ఆడటం తప్ప ఆమె చెయ్యగలిగిందేమీ లేదు.

"ఎన్నాళ్ళనుంచి ఈ రావటం?"

"వారం రోజుల్నుంచి"

"ఓహో! అంతకుముందు రెండేళ్ళ నుంచి ఇక్కడ నిన్ను చూడలేదన్న మాట అయితే వన్‌వే ట్రాఫిక్కైనా లేకపోతే. "

"అంటే "

"తనే వస్తోందా? నువ్వు కూడా వెళుతు "

"తనే వస్తోంది. నాకు ఆవిడ ఇల్లు తెలీదు"

"అదా సంగతి తెలిస్తే వెళ్ళే దానివే!"

వెక్కిళ్లు వినబడుతున్నాయి.



"ఇదిగో ఇవాళ చెబుతున్నాను సరిగా విను - ఆ ఉషాబాలొచ్చినా, నా కంట ఈ నవల్లు కనబడినా మక్కెలిరగ్గొట్టేస్తాను" కొంచెం సేపు ఆగి, "అర్థం అయిందా" అన్నాడు అవతల నుంచి జవాబుగా వెక్కిళ్లు, ఏడుపు కలిసి వినబడుతున్నాయి

ఏదో సాధించిన వాడిలాగ గర్వంగా ఆమె కళ్ళల్లోకి చూసి పుస్తకాన్ని ఆమె వైపు గిరవాటు పెట్టాడు

తరువాత వీధిగుమ్మం దగ్గరకువచ్చి నిలుచున్నాడు పొరుగిళ్ళలో కిటికీల దగ్గర నిలబడ్డ ఆడవాళ్ల తలుపులు వేసుకోవడం చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు

నా మనసంతా వికలమైపోయింది.

సుశీలే బతికుంటే ఈ రామం ఇలా తయారయ్యేవాడా వాడి అయిదో సంవత్సరంలోనే ఆమె పోవటం, ఆ తరువాత సంవత్సరం తిరగకుండా ఒను మళ్ళీ పెళ్ళి చేసుకోవటం - ఆ వచ్చినావిడ ఎనిమిదేళ్లు సాధించి మరీ చనిపోవటం జరిగింది

అప్పట్నుంచీ ఆడవాళ్ళమీద వాడికున్న కసి ఇంతా అంతా కాదు. నేను ఒకటి రెండుసార్లు వాడి మాటలు చాటుగా విన్నాను

"ఒరే గోపాలం! ఆడవాళ్ళకు ఎప్పుడూ రాస్త కూడా అలుసివ్వకూడదురా! ఇచ్చావో చూసుకో - నెత్తిమీద కూర్చుని చండశాసనులైపోతార్రా! వాళ్ళని చెప్పు కింద ధనియాలు నలిపినట్టు నలపాలి అప్పుడే మన ఆడుగులకి మడుగులొత్తుతారు" అని తన స్నేహితుడొకడికి చెబుతున్నాడు పైగా చేసే కానిస్టేబులు ఉద్యోగం వాడికి

మరింత కర్కశత్వాన్నిచ్చింది

వీధి గుమ్మం తలుపు తీశాను మారింగా కేశవస్వామి గుడిలో పాడుతున్న భజన గీతాలు వినిపిస్తున్నాయి తాళం లయబద్ధంగా వినబడుతోంది.

ం ం ం

నిర్వికార స్వామి నెల రోజులున్నుంచి కేశవస్వామి గుళ్ళో ఉంటున్నారు ఆయన వచ్చినప్పటి నుంచి భజన గీతాలు పాడటం వాటికి నేను తప్పని సరిగా వెళ్ళడం అలవాటు. వర్షం రాని రోజున ఊరిరైతులు ఇంకొంతమంది హాజరవుతుంటారు

నేను వెళ్లేసరికి అరడజను శిష్యుల మధ్య కూర్చుని పాడుతున్నారు.

నన్ను చూస్తూనే సాదరంగా ఆహ్వనిస్తూ, "ఎలా వచ్చావు నాయనా కాళ్లు కడుక్కోవటానికి నీళ్లు కూడా అయిపోయినట్టున్నాయే" అన్నారు.

ఆయనకు నా వయసే ఉన్నా నన్ను నాయనా అనే సంబోధిస్తారు

"పర్వాలేదండీ నా కాళ్ళకు బాడి అంటలేదు" అన్నాను - తడిగా ఉన్న అరికాళ్లు మెట్లమీద ఉన్న గోనెపట్టాకు తుడిచివేస్తూ.

"పక్క వీధులన్నీ బురదతో నిండి ఉంటాయి కదా!"

నేను నవ్వి, "మావాళ్లు కాళ్ళకు బురద అంటకుండా ఇటిక ముక్కలు, పెంకు ముక్కలు వేస్తారు. జాగర్తగా నడిస్తే బురద అంటదు" అన్నాను.

ఆయన ఒకింత సేపు మౌనంగా ఊరుకున్నారు.

"మేం ఈ ఊరు వదిలి వెళ్ళిపోతున్నాం నాయనా!"

ఉలిక్కిపడ్డాను

"అదేమిటి స్వామీ! ఇంత హఠాత్తుగా వెళ్ళిపోవటం ఎందుకు?"

"హఠాత్తుగా ఏమీకాదు నాయనా! నేను ఈ ఊరువచ్చి నెలరోజులు దాటిపోతూంది. ఒకే ఊళ్లో ఇన్నాళ్లుండటం ఏం బావుంటుంది. ఉదయానికి ముసురు తెరపి ఇస్తుంది. రేపు ప్రయాణమై పోతాము ఊర్లో అందరకూ ఇవ్వాళ తెలియజేశాము. మీరు తప్పక ఇక్కడికి వస్తారు కనుక నేనే చెబుదామని ఊరుకున్నాను"

"అరె!" అని మాత్రం అనగలిగాను

"ఇవ్వాళ ఆఖరు రోజుకదా ముసురు ఇలా ఉన్నప్పటికీ రాత్రంతా భజన గీతాలు పాడాలని నిశ్చయించుకున్నాం. తెల్లవారు జామున కొంచెం సేపు విశ్రాంతి తీసుకుంటాం"

నాకూ ఇంటికి వెళ్లాలనిలేదు. ఇంటికి వెళ్ళగానే అన్నీ గుర్తువస్తాయి. ఇక్కడే ఉంటే మనశ్శాంతిగా ఉంటుంది.

"నేనుకూడా ఈ రాత్రంతా జాగా

రం చేస్తాను. ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోతాను"

ఊళ్లోంచి ఒక్కళ్లు కూడా భజన గీతాల్లో పాల్గోటానికి రాని సమయంలో నేను రాత్రంతా ఉంటానన్నందుకు ఆయన అభినందిస్తారనుకున్నాను. కాని నా మాటలకు ఆయన కళ్ళల్లో లేశ మాత్రమైనా ప్రశంస కనిపించలేదు.

కొంచెంఆగి ఆయన ఇలాఅన్నారు.

"ఊర్లో వారంతా చాలా ఉదారులులా ఉన్నారు మేమంతా రేపు ఉదయమే బయలురేరి పోతామని తెలుసుకుని, ఈ ముసురులో బయటకు రాలేకపోయినా - మాకు పదిహేను రోజులదాకా ఏమి ఇబ్బంది కలుగకుండా సరిపడేంతకు దక్షిణలు సమర్పించుకున్నారు" అన్నారు వేలితో ఒక మూలగా ఉన్న బియ్యం బస్తాలను చూపిస్తూ

ఆయన మాటల్లో ఏమన్నా వ్యంగ్యం ఉందేమో ఒక పట్టాన అర్థం కాలేదు

నాకు తెలీకుండానే నాలో ఏదో ... హీనత రాజుకొంటూంది

నేను వెంటనే "నన్ను నేనే ... వారికి సమర్పించుకుంటున్నాను" అని అన్నాను అవును ... మధ్య మన శాంతి లభించేది ... వీరితో శాశ్వతంగా ఉండి పోవాలనుకోవటం స్వార్థమా? లేక త్యాగమా?

శ్రీ ఆంజనేయ చరిత్ర

(శ్రీ పరాశర సంహిత)

హనుమద్భక్తులకు, ఉపాసకులకు, హనుమన్మంత్ర విషయమై పరిశో చేయదలచిన వారలకు అత్యంత సులభ శైలిలో ఒక్క తెలుగుభాషలోనే వెలు పడిన శ్రీ పరాశర మహర్షిచే అందించబడిన "శ్రీ ఆంజనేయ చరిత్ర" 80 భాగములు 7 పుస్తకములుగా వెలువడినది.

7 పుస్తకముల ధర రు : 30/-

ముందుగా రు. 30/-లు ఎం ఒ ద్వారా పంపిన వారికి పోస్టేజికి వి పి పి పెట్టబడును.

శ్రీ హనుమంతుని గూర్చి పూర్తి వివరములు తెలుసుకొనుటకు, మంత్ర, తంత్ర శాస్త్రము తెలుసుకొనుటకు ఈ ఒక్క గ్రంథమే అనేక విషయము వివరించ గలదు.

వివరములకు .

శ్రీ హనుమత్సేవాసమితి

కాపూరివారివీధి, సత్యనారాయణపురం, విజయవాడ - 520 011

ఆయన చాలా సేపు మాట్లాడలేదు నా ముఖంలోకే చూస్తూ కూర్చున్నారు. నేను తలవంచుకు కూర్చున్నాను. ఈ మౌనం అంతా నన్ను అవగాహన చేసుకోవడానికి వినియోగించి ఉంటారు.

తరువాత నెమ్మదిగా ఇలా అన్నారు.

"ఎందుకు నాయనా ! ఈ మధ్య విచారంగా ఉంటున్నావు?"

"ఏం చెప్పమంటారు! చెప్పకూడని సమస్యలేవో ఎదురవుతున్నాయి నేను ఏకాకిని కాదు కదా!"

"నిజమే సంసారం దుఃఖహేతువు"

"భార్య లేకపోయినా నేను సంసారినే" అన్నాను విరక్తిగా.

"భార్య ఉన్నా సంసారిని కాదు నేను" అన్నారు ఆయన

ఆయన అన్నది నిజమే ఆయనకు భార్యే కాదు. పిల్లలు కూడా ఉన్నారు కాని అందర్నీ త్యజించారు

నా నిర్ణయం మరింత దృఢంగా పాతుకుంటోంది.

కాసేపటికి నేనే నిశ్శబ్దాన్ని భంగ పరుస్తూ, "సరే! దీక్ష ఎప్పుడిస్తారో చెప్పండి!" అన్నాను.

ఆయన తలెత్తి నాకళ్ళల్లోకి చూశారు ఏదో అనబోయి ఆమాయించుకున్నారు. ఒక నిముషం ఆగి తలవంచుకుని ఇలా అన్నారు

"తొందరేముంది నాయనా కొన్నాళ్ళపాటు మాతో ఉన్న తరు వాత నిర్ణయించుదాం! రేపు మాతో పాటు ప్రయాణమవుదువు".

"సరే!" అన్నాను నేను.

నెమ్మదిగా కేశవుని కీర్తిస్తూ భజన గీతం అందుకున్నారాయన. అప్పటి వరకు కునికి పాట్లుపడుతున్న శిష్యులొకరు చంచు తాళాలు మోగించడం మొదలుపెట్టాడు. మిగిలినవాళ్ల గొంతు కలపసాగారు. నేను వాటిలో లీనమై పోయాను. మధ్యమధ్య కొందరు పాట ఆపినా మిగతావాళ్ళు పాడటం వలన భజన ఎక్కడా ఆగకుండా సాగింది. సుమారు తెల్లవారు జాము నాలుగు గంటలకు భజన గీతాలు ఆపివేశారు.

"కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత మేం బయలుదేరుతాం నాయనా! ఇంటి దగ్గర నువ్వు కూడా విశ్రాంతి తీసుకునిరా!" అన్నారు.

నేను సరేనని మండపం బయటకు వచ్చాను.

ఇప్పుడు వర్షం జోరుగా పడుతోంది. ఇటిక ముక్కలమీద నాకాలు నిలువక బురదలోకి జారుతోంది. అతికష్టంమీద ఇంటికి చేరేసరికి తడిసి ముద్దయిపో యాను. బట్టలు మార్చుకుని మంచం

మీద పడ్డానో లేదో నిద్ర ముంచుకొచ్చే సింది

ం ం ం

పెరట్లో ఆడవాళ్ళ మాటలు గందర గోళంగా వినబడుతుంటే హఠాత్తుగా మెలకువ వచ్చేసింది. అప్పటికే గది లోకి బారెడు ఎండవచ్చి పడుతోంది- ఉదయం వరకు ఉన్న ముసురు ఎక్కడ పోయిందో!

నా మనసులో ఏదో భయం పీకు తోంది. జయ ఏమీ అఘాయిత్యం చెయ్యలేదు కదా! ఇంతలో పిర్వికార స్వామి గుర్తు వచ్చాడు ఆయన దగ్గ రికి వెళ్ళాలి.

మనస్సు నిగ్రహించుకోలేక పోతు న్నాను ఇంట్లో ఏదో జరుగుతూంటే ఏమీ పట్టనట్టు ఎలా పోను.

గబ గబా మంచం దిగి పెరట్లోకి వచ్చాను. నలుగురైదుగురు ఆడవాళ్ళు గుంపుగా నిలబడి మాట్లాడుతున్నారు. వీళ్ళంతా మా ఇరుగుపొరుగు బంధు వులు వాళ్ల మాట్లాడే మాటలేవీ నా చెవికెక్కటం లేదు

వాళ్ళల్లో ఉన్న లీల నాకు కూతురు వరస చంటి బాబును చంకలో వేసుకు వచ్చింది.

"అమ్మాయ్ లీలా! ఇలారా!" అని పిలిచాను.

వెంటనే నా దగ్గరికి వచ్చింది

"ఏమైందమ్మా? అంతా ఖంగారుగా ఉన్నారు" అన్నాను నా లోపలి ఆందో ళనను అదిమిపెడుతూ.

ఆమె కొంచెం నవ్వి, "కాసేపు పిల్లొత్తుకో బాబాయ్! వెధవ! తెగఅల్లరి చేసేస్తున్నాడు" అంది చంటిబాబును అందిస్తూ.

నాకు వెంటనే చేతులు ముందుకు సాగలేదు. వాడు ఒక చేత్తో వాళ్ళమ్మ జుట్టు పీకుతూ, మరో చేత్తో నన్ను దగ్గరగా రమ్మని పిలుస్తున్నాడు

"కాస్త మీ మనమణ్ని ఎత్తుకోండి బాబాయ్!" అంది ఈసారి నా వైపు యుక్తిగా చూస్తూ.

"మనమణ్ని" అన్నమాట నాలో సంతోషాశ్చర్యాలు కలిగించాయి. వెంటనే వాడిని ఎత్తుకున్నాను.

మళ్ళీ లీల ఆడవాళ్ళ వైపు తిరగ బోతుంటే ఆపి. "అసలేమయిం దమ్మా?" అన్నాను.

ఆమె మాకోడలు గదివైపు ఓమారు తొంగిచూసి మళ్ళీ నా వైపు తిరిగి, రహస్యం చెబుతున్నట్టు- "జయ ఇప్పుడు మామూలు మనిషి కాదు" అంది. నాకు విషయం అర్థం కావ టానికి మరో నిముషం పట్టింది.

చంకలో ఉన్న చంటిబాబు మళ్ళీ లీల చేతుల్లోకి వెళ్లనని మారాము చేస్తు

న్నాడు. అలాగే బాబును చంకనేసుకుని జయ గదిగుమ్మం దగ్గరకు వెళ్లాను.

గదిలోంచి మాటలు తక్కువ స్వరంలో వినవస్తున్నాయి.

ఆమె మంచంమీద కూర్చునిఉంది రామం నేరస్తుడిలా నిలబడి ఉన్నాడు.

"రాత్రి కింద పడిపోయినప్పుడు దెబ్బేమైనా తగిలిందా?"

"... .. . ."

"సరిగా చెప్పు. డాక్టరు దగ్గరికి తీసుకువెళతాను. మరేమీ భయం ఉండదు" ఇంకా ఏదో అంటున్నాడు.

చంటిబాబు నా చెవి దగ్గరికంటా నోరు పెట్టి "తాత" అని అరిచాడు గట్టిగా.

నా తల గింగుర్లెత్తింది.

చటుక్కున నావైపు తిరిగి చూశారు వాళ్ళిద్దరూ.

నేను అక్కణ్ణించి వచ్చేశాను.

సుమారుగా నా వెనుకనే రామం వచ్చేశాడు. పెరట్లో ఆడవాళ్లను చూసి తలవంచుకుని వీధిలోకి వెళ్లిపోయాడు. పూర్వం కనపడే ఆ కర్కశమైన చిరునవ్వు కనిపించలేదు. ముఖం అంతా ఆందోళనతో నిండిపోయి ఉంది.

వాడు బయటకు వెళ్లీ వెళ్లగానే పెరట్లో ఆడవాళ్లంతా జయ గదిలోకి బిరబిర లాడుతూ వెళ్ళారు

చంటిబాబు నామెడ పట్టుకొని వదలటం లేదు. వీధి గుమ్మం దగ్గరికివచ్చి నిలుచున్నాను.

రాత్రి జరిగిందంతా తలుచుకుంటుంటే ఎంతో పేలవంగా అనిపిస్తోంది. ఎంతో త్వరగా తీసుకున్న నిర్ణయం అంత త్వరగానూ సమసిపోయింది.

ఏమైనప్పటికీ నేను ఇక్కడినుంచి కదిలివెళ్లేది లేదు. ఓ చంటిబాబు నామెడ

చుట్టూ చేతులు వేయడానికి ఈ లోకం లోకి వస్తుంటే ఇక్కడి నుంచి నేనెలా పారిపోతాను।

మనుషుల్ని బంధించి ఉంచే రహస్యం నాకిప్పుడే అవగతమౌతోంది ఈ పిల్లలే లేకపోతే ప్రపంచంలో మనుషులంతా ఒకళ్ళనొకళ్ళ పట్టకుండా చెల్లాచెదురై పోతారేమో...

దూరంగా నిర్వికార స్వామి శిష్య బృందంతో వెళ్ళిపోతూ కనిపించారు. దారిలో ఎదురైన రైతులు వంగి వంగి దండాలు పెడుతున్నారు.

ఆయన పాదాం నిండా బురద అంటి ఉంది. దాని అంటుకోకుండా వేసిన ఇటికలమీద ఆయన నడవలేక బురద లోనే నడుస్తూ వెడుతున్నారు... ★